




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 156 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | శనివారం 11 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ప్రధాని నరేంద్ర మోదీపై 'మహాకావ్యం'

## ఒడిశాకు చెందిన సంస్కృత పండితుడు సోమనాథ్ దశ్ ప్రధాని నరేంద్ర మోదీపై మహాకావ్యం రచించారు.

**(రిపబ్లిక్ న్యూస్), జనవరి 11:** ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన సంస్కృత పండితుడు సోమనాథ్ దశ్ ప్రధాని నరేంద్ర మోదీ పై మహాకావ్యాన్ని రచించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. మోదీ జీవన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, ఆయన రాసిన రచనలను వివరిస్తూ 12 అధ్యాయాలు.. 1200 శ్లోకాలతో 'నరేంద్ర ఆరోహణం' పేరిట ఈ మహాకావ్యాన్ని రాసినట్లు సోమనాథ్ పేర్కొన్నారు.

ఈ గ్రంథ రచనకు ప్రతాపరుద్రీయం, కావ్యప్రకాశం వంటి ప్రాచీన, సంస్కృత ఇతిహాసాల శైలిని అనుసరించానన్నారు. దీనిని రాయడానికి నాలుగు ఏళ్లు పట్టిందని అన్నారు. ఇటీవల గుజరాత్లో లోని వెరావల్లో జరిగిన యువజనోత్సవంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు సోమనాథ్ పేర్కొన్నారు. ఈ కావ్యాన్ని హిందీ, ఆంగ్ల భాషల్లో అనువదించినట్లు తెలిపారు. సోమనాథ్ ఈ కావ్యం గురించి మాట్లాడుతూ ప్రధాని మోదీ జీవన విధానం.. రాజకీయ ప్రయాణం ఎల్లప్పుడూ చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. పుస్తక రచన కోసం వివిధ వార్తా పత్రికలు, పుస్తకాలు, ప్రధాని మోదీ 'మన్కి బాత్' కార్యక్రమం మొదలైన వాటి




నుంచి సమాచారం తీసుకున్నట్లు తెలిపారు.

# అందుకే నేను ప్రతి సంక్రాంతికి మా ఊరికి వెళ్తున్నాను :చంద్రబాబు

**తెలుగు ప్రజలందరికీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.**

**విజయవాడ, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** తెలుగు ప్రజలందరికీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరిలో సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆకాంక్షించారు. పండగ సమయంలో ఊరెళ్లి అందరితో సంతోషంగా గడపాలని.. అందుకే తాను ప్రతి సంక్రాంతికి ఊరికి వెళ్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

"పండగ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఊరు వెళ్లి నలుగురితో కలవటం అలవాటు చేసుకోవాలి. అందుకే నేను ప్రతి సంక్రాంతికి మా ఊరికి వెళ్తాను. ఊరు వెళ్లే సంప్రదాయానికి భువనేశ్వరే కారణం. పాతికేళ్ల క్రితం ఆమె పట్టుబట్టి మొదలుపెట్టిన ఈ సంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నాం. మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఒకచోట అంతా కలవటం, మాట్లాడుకోవడం ఎంతో అవసరం. మనం ఆనందంగా పండగ చేసుకునేటప్పుడు ఊరిలో పేదవారు కూడా ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది. వారికి చేయూతనిచ్చి నిలబెట్టాల్సిన బాధ్యత మిగిలినవారిపై ఉంది. ఈ విధానం ప్రోత్సహించడానికే పీ4 కాన్సెప్ట్ పేపర్ను ఆదివారం విడుదల చేస్తున్నాం. దీనిపై అన్ని స్థాయిల్లో చర్చ జరిగాక అమల్లోకి తెస్తాం" అని చంద్రబాబు తెలిపారు.



# రాష్ట్ర అభివృద్ధిని గవర్నర్ జీర్ణించుకోలేకపోతున్నారు: సీఎం స్టాలిన్

**అసెంబ్లీలో ప్రసంగించకుండా వాకౌట్ చేసిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని ఉద్దేశిస్తూ సీఎం ఎమ్కే. స్టాలిన్ మరోసారి విమర్శలు చేశారు.**


**చెన్నై, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య కొంతకాలంగా భేదాభిప్రా-యాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే మరోసారి గవర్నర్పై ముఖ్యమంత్రి ఎమ్కే. స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

రాష్ట్ర అభివృద్ధిని చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "గవర్నర్ అసెంబ్లీకి వచ్చినా ప్రసంగించకుండానే మధ్యలో వెళ్లిపోయారు. ఆయన తీరు చిన్న పిల్లల చేష్టల మాదిరిగా ఉంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ బాధ్యతను నిర్వర్తించలేకపోయారు. తమిళనాడు అభివృద్ధి చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు" అని సీఎం తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించలేదని ఆరోపిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి.. ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. "రాజ్యాంగం, జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగింది. జాతీయ గీతాన్ని గౌరవించడం రాజ్యాంగం ప్రకారం మన ప్రాథమిక విధి. అసెంబ్లీలో చోటు చేసుకున్న పరిణామాలు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయి" అంటూ ఇటీవల 'ఎక్స్' (ట్విటర్)లో పోస్టు పెట్టారు. ఈ పరిణామంతో అధికార డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్కు మధ్య మరోసారి విభేదాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రజలను, ప్రభుత్వాన్ని ఆయన ఎప్పుడూ అవమానిస్తున్నారని ఆరోపించిన సీఎం స్టాలిన్.. గవర్నర్ చర్యపై మరోసారి విమర్శలు చేశారు.



# కొండపోచమ్మ సాగర్ డ్యామ్లో పడి.. ఐదుగురు యువకులు మృతి

**సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్లో పడి హైదరాబాద్కు చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు.**




**సిద్దిపేట, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్లో పడి హైదరాబాద్కు చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్కు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పో-యారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతులు హైదరాబాద్కు చెందిన ధనుష్ (20), లోహిత్ (17), దినేశ్వర్ (17), జతిన్ (17), శ్రీనివాస్ (17)గా గుర్తించారు. మృతి చెందిన ధనుష్, లోహిత్ ఇద్దరూ సొంత అన్నదమ్ములు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు: చంద్రబాబు

## గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు.

**అమరావతి, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కానుందని తెలిపారు.

ఈ హైడ్రోజన్తో ఎరువులు, రసాయనాలు తయా-రవుతాయని పేర్కొన్నారు. హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉ ందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని వివరించారు. "గ్రీన్కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్ను టేకోవర్ చేయనుంది. ఇక్కడ గ్రీన్ అమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ ప్లాంట్పై రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్డ్ గ్యాస్ తయారీకి 500 కేంద్రాలు పెడుతోంది. ఒక్కో కేంద్రానికి రూ.130 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. బయోగ్యాస్కు ఉ పయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుంది. గడ్డి పెంచడానికి ఎకరాకు రూ.30 వేలు కౌలు రైతులకు రిలయన్స్ చేయనుంది. బెంగళూరు సంస్థ స్వాపింగ్ బ్యాటరీల మోడల్ను కుప్పానికి తెచ్చింది. సూర్యఘర్ అమలులో ఉన్న ఇళ్ల య-జమానులకు స్వాపింగ్ బ్యాటరీల ఛార్జింగ్కు డబ్బు చెల్లిస్తారు. దీంతో వారికి అదనపు ఆదాయం చేకూరనుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిపై కొత్త ఆలోచనలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం



సౌర ఫలకాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

# భువనగిరి భారాస కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి



**భువనగిరి, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై భారాస భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచెల రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరిలోని భారాస కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. కంచెల రామకృష్ణారెడ్డి భువనగిరిలో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం. రేవంత్రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని య-ువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశా-రు. ఈ క్రమంలో భారాస కార్యాలయంపై దాడి చేసి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

# సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో 3 రోజుల పాటు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

## సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జనవరి 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

**హైదరాబాద్, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జనవరి 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ పోస్టర్ను మంత్రి విడుదల చేశారు. "వివిధ రాష్ట్రాలకు చెందినవారు స్వీట్ ఫెస్టివల్లో పాల్గొంటారు. ఇండోనేషియా, శ్రీలంక, కాఠ్మాండూ, స్కాట్లాండ్, మలేసియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ఫ్లయర్స్ కైట్ ఫెస్టివల్లో పాల్గొంటారు. ఈ మూడు రోజులు ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.. ఎవరైనా పాల్గొనవచ్చు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివల్ ఉంటుంది. సంస్కృతిలో



భాగమే ఈ పండుగలు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవాలి. తెలంగాణలోని ప్రాచీన కట్టడాలు, దేవాలయాలను పర్యటించాలి. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటు అందిస్తుంది" అని మంత్రి జూపల్లి తెలిపారు.

# రైల్వే స్టేషన్లో కూలిన పైకప్పు.. శిథిలాల కింద చిక్కుకున్న కూలీలు


**యూపీలోని కన్నౌజ్ రైల్వే స్టేషన్లో పైకప్పు కూలి పలువురు కార్మికులు చిక్కుకుపోయారు.**

**కన్నౌజ్, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** ఉత్తరప్రదేశ్లో ప్రమాదం జరిగింది. కన్నౌజ్ రైల్వే స్టేషన్లో నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పు ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దీంతో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. శిథిలాల కింద కనీసం 20 మంది చిక్కుకుని ఉండొచ్చని ప్రాథమిక సమాచారం. ఇప్పటివరకు ఆరుగురిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద వారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యూపీలోని కన్నౌజ్ రైల్వే స్టేషన్లో ఆధునికీకరణ పనుల్లో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం రెండో అంతస్తులో ఉన్న పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించారు.



# గ్రీన్కో సోలార్ పార్క్తో భారీగా ఉపాధి అవకాశాలు :డిప్యూటీ సీఎం పవన్

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కర్నూలు జిల్లాలో పర్యటించారు. పిన్నాపురం వద్ద ఏర్పాటైన అతిపెద్ద గ్రీన్కో సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు.



**కర్నూలు, జనవరి 11, (రిపబ్లిక్ న్యూస్):** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కర్నూలు జిల్లాలో పర్యటించారు. పిన్నాపురం వద్ద ఏర్పాటైన అతిపెద్ద గ్రీన్ కో సోలార్ పార్క్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. "కేంద్రం అనుమతితో 365 హెక్టార్ల అటవీ భూమిని సంస్థ కొనుగోలు చేసింది. అందుకు నెల్లూరులో రూ.36 కోట్ల విలువైన భూమిని సంస్థ ప్రభుత్వానికి ఇచ్చింది. ఫారెస్టు, రెవెన్యూ మధ్య 45 హెక్టార్ల భూమి వివాదంలో ఉంది. 11.49 ఎకరాలు రైతుల నుంచి గ్రీన్కో కంపెనీ తీసుకుంది. గ్రీన్కో కంపెనీకి అంతర్జాతీయంగా మంచి పేరుంది. దేశంలో రూ. లక్షన్నర కోట్ల పెట్టుబడి పెడుతోంది. మన రాష్ట్రంలో రూ.35వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం 2,800 ఎకరాల్లో నిర్మిస్తోన్న ప్రాజెక్టు ఇది. ఇలాంటి సమీకృత ప్రాజెక్టు దేశంలో మరోచోట లేదు. ఈ భూమిపై రెవెన్యూ, అటవీశాఖ మధ్య చిన్న వివాదం వచ్చింది. వివాదం పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించాం. ఇంత భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు పర్యాటక కేంద్రం కానుంది. కేంద్రం కూడా తగినంత సహకారం అందించాలి. గ్రీన్ కో కంపెనీ పిన్నాపురంలో ఇప్పటికే రూ.12వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. మరో రూ.10వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు, రాష్ట్రానికే కాదు.. దేశానికే మంచి పేరు వస్తుంది. సీఎస్ఆర్ కింద పలు కార్యక్రమాలు చేయాలని కోరుతున్నా. పాఠశాలలు,



సేంద్రియ సాగు, గోవుల సంతతి పెంచేలా చూడాలి. 50వేల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రీన్ కో కంపెనీకి ధన్యవాదాలు" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్




# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1922 : మధుమేహ రోగులకు ఇన్సులిన్ వాడకం ప్రారంభించిన రోజు.
- 1928 : ప్రకృతి ధర్మవాద సమయంలో ఒక ఆంగ్ల నవలారచయిత, కవి థామస్ హార్డీ మరణం (జ.1840).
- 1944 : జార్ఖండ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ జననం.
- 1966 : భారత దేశ రెండవ ప్రధాని, ప్రధానిగా శ్వేతవిప్లవం, హరితవిప్లవం, పాకిస్తాన్ యుద్ధం వంటి విజయాలు సాధించిన లాల్ బహదూర్ శాస్త్రి మరణం (జ.1904).
- 1973 : భారత క్రికెట్ క్రీడాకారుడు రాహుల్ ద్రవిడ్ జననం. (చిత్రంలో)
- 1991 : అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. ఎలక్ట్రాన్‌కు వ్యతిరేక కణమైన పాజిట్రాన్ కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్ డేవిడ్ అండర్సన్ మరణం (జ.1905).
- 2008 : న్యూజీలాండుకు చెందిన పర్వతారోహకుడు, అన్వేషకుడు ఎడ్మండ్ హిల్లరీ మరణం (జ.1919).


ఇన్సులిన్


థామస్ హార్డీ


శిబు సోరెన్


లాల్ బహదూర్ శాస్త్రి


రాహుల్ ద్రవిడ్


కార్ల్ డేవిడ్ అండర్సన్


ఎడ్మండ్ హిల్లరీ

# ప్రభాస్ పెళ్లి ఆ అమ్మాయితో..

## రామ్ చరణ్ సూపర్ హింట్

'బాహుబలి' ప్రభాస్ వివాహం కోసం సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పెళ్లి గురించి నటుడు రామ్ చరణ్ హింట్ ఇచ్చారు.





'బాహుబలి' హీరో ప్రభాస్ వివాహం కోసం సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆయన ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? ఎవరిని వివాహమాడతారు? అని మాట్లాడుకున్న సందర్భాలు కోకొల్లలు. ఆయన వివాహమాడబోయే అమ్మాయి ఈమేనంటూ ఇప్పటికే ఎన్నో ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రభాస్ పెళ్లిని ఉద్దేశించి ఆయన స్నేహితుడు, నటుడు రామ్ చరణ్ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టినట్లు తెలుస్తోంది. ఆయన ఎవరిని పెళ్లాడనున్నారనే విషయాన్ని 'అన్‌స్టాపబుల్' కార్యక్రమంలో చెప్పినట్లు సమాచారం. ప్రభాస్ పెళ్లి గురించి బాలకృష్ణ ప్రశ్నించగా రామ్‌చరణ్ నవ్వుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని గణపవరానికి చెందిన అమ్మాయిని అతడు పెళ్లి చేసుకోనున్నారని చెప్పినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి ఎపిసోడ్ త్వరలో ప్రసారం కానుంది. బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న సెలబ్రిటీ టాక్ షో 'అన్‌స్టాపబుల్'. 'గేమ్ ఛేంజర్' ప్రమోషన్స్‌ భాగంగా రామ్‌చరణ్ ఈ కార్యక్రమంలో సందడి చేసిన విషయం తెలిసిందే. ఈ స్పెషల్ ఎపిసోడ్కు సంబంధించిన తొలి భాగం జనవరి 8న విడుదలైంది. ఇందులో చరణ్ పలు విశేషాలు పంచుకున్నారు. తన కుమార్తె క్లీంకార గురించి మాట్లాడారు. "పాప పుట్టిన తర్వాత నీలో వచ్చిన మార్పేంటి? అని బాలకృష్ణ అడగ్గా.. "ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. షూటింగ్ ఉన్నా, లేకపోయినా ఉదయం 2 గంటలపాటు తనతో ఆడుకుంటా. క్లీంకార ముఖాన్ని ఎప్పుడు చూపిస్తారు? అని చాలామంది అడుగుతుంటారు. ప్రైవసీని తనకు గిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నా. తనకు తానుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆశిస్తున్నా. వీలైనంత వరకూ ఫేస్ చూపించకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా. ఎందుకంటే.. ఫలానా వాళ్ల అబ్బాయి అని తెలియడంతో మేం స్కూల్లో ఫ్రీగా ఉండలేకపోయాం. క్లీంకార ఎప్పుడూ అమ్మ అని అనడమే తప్ప నాన్న అని పిలవడం లేదు. ఎప్పుడైతే నాన్న అని అంటుందో అప్పుడు ఫేస్ చూపిస్తా (నవ్వుతూ)" అని తెలిపారు. రెండో భాగం జనవరి 14న ప్రసారం కానుంది. ఇందులో చరణ్ స్నేహితులు శర్వానంద్, విక్కీ పాల్గొన్నారు. చరణ్ తో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం బాలయ్య.. చరణ్ ప్రభాస్కు ఫోన్కాల్ చేయించారు. సరదాగా పలు విశేషాల గురించి చర్చించుకున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# సుకుమార్ ఏ హీరో స్ఫూర్తితో ఇండస్ట్రీలోకి వచ్చారో తెలుసా!

వరుస బ్లాక్బస్టర్ సినిమాలతో రికార్డులు సృష్టిస్తున్నారు దర్శకుడు సుకుమార్. మరి ఆయన ఏ హీరో స్ఫూర్తితో ఇండస్ట్రీలోకి వచ్చారో తెలుసా..




క్రియేటివ్ జీనియస్ అని అభిమానులు పిలుచుకునే దర్శకుడు సుకుమార్ ప్రస్తుతం సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నారు. బ్లాక్ బస్టర్ సినిమాలతో అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకొని అందరి ప్రశంసలు పొందుతున్నారీ టాలెంటెడ్ దర్శకుడు. ఒకవైపు ఆయన అగ్ర హీరోలతో సినిమాలు తీసి చరిత్ర సృష్టిస్తుంటే మరోవైపు ఆయన శిష్యులు కూడా ఇండస్ట్రీలో వరుస సినిమాలు తీస్తూ ఆకట్టుకుంటున్నారు. మరి ఈ లెక్కల మాస్టారు. ఏ హీరో స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చారో తెలుసా! నటుడు రాజశేఖర్‌కు సుకుమార్ వీరాభిమాని. ఈవిషయాన్ని ఓ సందర్భంలో ఆయనే చెప్పారు. చిన్నతనంలో రాజశేఖర్ను ఇమిటేట్ చేసేవారని తెలిపారు. "రాజశేఖరకు నేను వీరాభిమానిని. ఆయన నటించిన ఆహుతి, ఆగ్రహం, అంకుశం, తలంబ్రాలు, మగాడు తదితర చిత్రాలు నన్నెంతగానో ప్రభావితం చేశాయి. చదువుకొనే రోజుల్లో నేను ఆయన్ను ఇమిటేట్ చేస్తుండేవాడిని. నా పెర్ఫామెన్స్ మెచ్చి అందరూ 'వన్స్మోర్' అనేవారు. అలా నేను ఫేమస్ అయిపోయా. సినిమాల్లోకి వెళ్లి, ఏదైనా చేయగలననే నమ్మకం కలిగేందుకు అప్పుడు రాజశేఖరే కారణమయ్యారు" అని చెప్పారు. ఇక సుకుమార్ సినిమా అంటే కచ్చితంగా ఓ హుషారైన గీతం ఉండాల్సిందే. ఆయన దర్శకత్వం వహించిన ప్రతి సినిమాలో ఓ ఐటెం సాంగ్ కచ్చితంగా ఉంటుంది. అయితే, సుకుమార్కు 'ఆర్య'లోని ఐటెం సాంగ్ లిరిక్స్ నచ్చలేదట. కానీ, ట్యూన్ బాగుందని దీన్ని సినిమాలో పెట్టారు. అది సూపర్ హిట్గా నిలిచింది. ఇప్పటికీ సోషల్ మీడియాలో రీల్స్లో కనిపిస్తూనే ఉంది. ఈ పాట లిరిక్స్ గురించి సుకుమార్ ఓ సందర్భంలో మాట్లాడుతూ.. "'ఆర్య'లో ఐటెం సాంగ్ పెట్టాలనుకోలేదు. బ్యాక్ గ్రౌండ్లో ఒక పాట పెట్టాలనుకొన్నా. అదికాస్తా ఐటెం సాంగ్ అయింది. ట్యూన్ చేశాక లిరిక్స్ రాశారు. అవి నాకు నచ్చలేదు. 'చయ్య చయ్య' పాట లాగా ఉండాలనుకుంటే లిరిక్స్ ఇలా ఉన్నాయేంటనుకున్నాను. కానీ, ట్యూన్ బాగుండేసరికి పాటను కంటిన్యూ చేశాను. ఎప్పుడైతే ఆ పాట (అ అంటే అమలాపురం) హిట్ అయిందో.. అప్పుడే తెలిసింది సినిమాకు ఐటెం సాంగ్ ఎంత ముఖ్యమోనని. అప్పటినుంచి ప్రతి సినిమాలో అలాంటి పాటను కచ్చితంగా ఉండేలా చూసుకుంటున్నా" అని చెప్పారు. తాజాగా 'పుష్ప2'తో చరిత్ర సృష్టించిన సుకుమార్.. రామ్చరణ్తో ఓ సినిమా (ఆర్సీ17) చేయనున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమను మరింత కలర్ఫుల్ చేసేందుకుఆర్సీ17 రానుందని నిర్మాణ సంస్థ ఈ సినిమాను ఉద్దేశించి ఇటీవల ఓ పోస్ట్ పెట్టింది. గతంలో వీళ్లిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'రంగస్థలం' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో హిట్ కాంబో మరోసారి రిపీట్ కానుందంటూ అభిమానులు తెగ ఖుషీ అవుతున్నారు.

# తల్లిని గుర్తుచేసుకొని ఖుషీకపూర్ ఎమోషనల్

ఖుషీ కపూర్, జునైద్ ఖాన్ జంటగా నటించిన చిత్రం 'లవ్యప్ప'. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఖుషి ఎమోషనల్ అయ్యారు.

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్, ఆమిరాఖాన్ తనయుడు జునైద్ ఖాన్ జంటగా నటించిన చిత్రం 'లవ్యాపా'. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం శుక్రవారం ముంబయిలో వేడుకగా జరిగింది. ఇందులో పాల్గొన్న ఖుషీకపూర్ తన తల్లిని గుర్తుచేసుకొని ఎమోషనల్ అయ్యారు. "ఒకవేళ శ్రీదేవి ఈ కార్యక్రమంలో పాల్గొని ఉంటే ఏవిధంగా ఫీలయ్యేవారు? " అని విలేకరి ప్రశ్నించగా.. "నేను చాలా ఎమోషనల్గా ఫీలవుతా. ఇప్పుడు అమ్మ గురించి ఏమీ మాట్లాడాలనుకోవడం లేదు" అని బదులిచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఆమిర్ ఖాన్.. శ్రీదేవిపై తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ చిత్రంలో ఖుషిని చూస్తుంటే తనకు శ్రీదేవి గుర్తుకువచ్చిందని అన్నారు. "శ్రీదేవి అంటే నాకెంతో ఇష్టం. కెరీర్ ఆరంభం నుంచి ఆమెను అభిమానిస్తూనే ఉన్నా. ఇదే విషయాన్ని ఎన్నోసార్లు చెప్పా. ఆమెతో ఒక్కసారైనా కలిసి వర్క్ చేయాలనుకున్నా. దురదృష్టవశాత్తూ నా కల నెరవేరలేదు. ఏది ఏమైనా నేను ఎప్పటికీ ఆమెకు వీరాభిమానినే. ఇది ఖుషీ చిత్రం. ఇది ఆమెకెంతో ప్రత్యేకమైన క్షణం. ఈ చిత్రాన్ని ఇప్పటికే చూశాను. ఇందులో ఖుషీకపూర్ యాక్టింగ్ చూస్తుంటే శ్రీదేవిని చూసినట్లు అనిపించింది. శ్రీదేవి ఎక్కడ ఉన్నా ఖుషీ విషయంలో ఆమె ఎంతో



ఆనందంగా ఉంటుంది. ఆమె ఆశీస్సులు వీళ్లపై ఎప్పుడూ ఉంటాయి" అని అమీర్ అన్నారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవుడే'. నేటితరం యువతీయువకుల ప్రేమ కథతో దీనిని రూపొందించారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్గా 'లవ్యపా' తెరకెక్కుతోంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 7న విడుదల కానుంది. 2023లో విడుదలైన 'ది ఆర్చీస్'తో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చారు ఖుషీకపూర్. అది డైరెక్ట్ ఓటీటీలో విడుదలైంది. ఇందులో ఆమె నటనతో ఆకట్టుకున్నారు. ఆమె నటించిన రెండో చిత్రమే 'లవ్యపా'. గతేడాది విడుదలైన 'మహారాజ్తో జునైద్ ప్రేక్షకులను అలరించారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ..
# భారత జట్టు ప్రకటన మరింత ఆలస్యం?

టీ20 ప్రపంచ కప్పు నెగ్గి.. పదిహేడేళ్ల దాహానికి తెరపడేలా చేసుకున్నాం. అయితే, చాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుని కూడా పన్నెండేళ్లు కావడం గమనార్హం. మరోసారి టీమ్ ఇండియా దానిపై దృష్టిసారించింది.




ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తుండగా.. భారత్ ఆడే మ్యాచులన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. తుది జట్టుపై బీసీసీఐ సెలక్టర్లు ఇంకా ఓ నిర్ణయానికి వచ్చినట్లు లేరు. షెడ్యూల్ ప్రకారం జనవరి 12వ తేదీ (ఆదివారం) లోగా స్క్వాడ్లను ఆయా జట్లు ప్రకటించాలి. కానీ, భారత్ మాత్రం ఇంకాస్త సమయం తీసుకొనే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. తొలుత ఇంగ్లండ్ సిరీస్లకూ.. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జట్లను ఎంపిక చేయాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భావించింది. ఇంగ్లండ్తో టీ20 సిరీస్కు మాత్రమే ఇవాళ లేదా ఆదివారం టీమ్ను ప్రకటించనుందని తెలుస్తోంది.

## ఐసీసీకి విజ్ఞప్తి..!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి కనీసం నెల రోజుల ముందే ఆయా జట్లను ప్రకటించాల్సి ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం ఐదు వారాల ముందే ప్రాథమిక జట్టును ప్రకటించి.. తర్వాత మార్పులు, చేర్పులు చేసుకొనే అవకాశాన్ని ఐసీసీ కల్పించింది. అయితే, బీసీసీఐ మాత్రం నెల రోజుల ముందే ఫైనల్ స్క్వాడ్ను ప్రకటిస్తామని ఐసీసీకి విజ్ఞప్తి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో జనవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ కోసం స్క్వాడ్ను ప్రకటించే అవకాశం ఉంది. మెగా టోర్నీ ప్రారంభమయ్యే కొన్ని రోజుల ముందు వరకూ.. 15 మందితోపాటు ట్రావెల్ రిజర్వ్ ముగ్గురిని ఎంపిక చేయాలి. ఆ స్క్వాడ్లో మార్పులు చేసుకొనేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే, అందుకు ఐసీసీ అనుమతి తప్పనిసరి.


## ఇంగ్లండ్ సిరీసు సెలక్ట్ అయితే..

ఇంగ్లండ్ మూడు వన్డేల సిరీస్ను భారత్ స్వదేశంలో ఆడనుంది. ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభం కానుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ ఆడబోయే చివరి వన్డే సిరీస్ అదే. దీంతో ఐసీసీ టోర్నీకి సన్నాహక మ్యాచ్ను వినియోగించుకోవాలని చూస్తోంది. వన్డే సిరీస్కు ఎంపికయ్యే జట్టే.. ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగడం ఖాయమని క్రికెట్ వర్గాల విశ్లేషణ. ఒకటి లేదా రెండు మార్పులు మాత్రమే ఉండొచ్చు. అదీనూ బుమ్రా, పంత్ వంటి ప్లేయర్లకు విశ్రాంతి ఇవ్వడం, షమీ ఫిట్నెస్ సాధించడం వంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజాకు ఇదే చివరి ఐసీసీ టోర్నీ అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# ఇంటి చిట్కాలు

# ఇంట్లో వచ్చే ఎలాంటి వాసనలైనా దూరం చేసే రూమ్ ఫ్రెషనర్స్‌ని మీరే తయారు చేయండిలా

ఇంట్లో రకరకాల వాసనలు వస్తుంటాయి. ఇవి చాలా ఇబ్బంది పెడతాయి. వీటిని దూరం చేసేందుకు ఎయిర్ ఫ్రెషనర్స్ వాడతారు. అయితే, ఇవన్నీ కూడా కెమికల్స్‌తో నిండి ఉంటాయి. అలా కాకుండా, ఇంట్లోనే కెమికల్స్ వాడకుండా తయారుచేసే ఎయిర్‌ఫ్రెషనర్స్ గురించి తెలుసుకోండి.




మనం ఎక్కువ టైమ్ ఇంట్లోనే ఉంటాం. అలాంటి ఇల్లు నీట్‌గా, సువాసన భరితంగా ఉంటే హ్యాపీగా రిలాక్స్ అవుతాం. అందుకోసమే మార్కెట్లోకి ఎన్నో వెరైటీ ఎయిర్ ఫ్రెషనర్స్ వచ్చాయి. ఇవన్నీ కూడా సువాసనలు వీస్తూ మంచి ఆహ్లాదాన్నిస్తాయి. అయితే, మార్కెట్లో దొరికేవన్నీ కూడా ఎక్కువగా కెమికల్స్ వేసి తయారుచేసినవి. అలా కాకుండా ఇంట్లో దొరికే పదార్థాలతోనే ఎలా ఎయిర్‌ఫ్రెషనర్స్ తయారు చేయొచ్చో తెలుసుకోండి. ఇవన్నీ కూడా ఇంటి పదార్థాలతోనే తయారుచేస్తాం. కాబట్టి, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. మరి ఆ పదార్థాలు ఏంటి.. వాటిని ఎలా తయారుచేయాలో తెలుసుకోండి.

## వీటితో పాటు

ఇంట్లో వాసనలు రాకుండా ఇల్లు సువాసన భరితంగా ఉండాలంటే కేవలం స్ప్రేలు చేస్తే సరిపోదు. మరికొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటంటే..రెగ్యులర్‌గా మెంటెయిన్ చేయాలి. తయారుచేసిన ఎయిర్ ఫ్రెషనర్ కొన్ని రోజులు కాగానే గాఢత తగ్గుతుంది. కాబట్టి.. కొన్ని వారాల్లోనే మళ్లీ తయారుచేసి వాడాలి. ఇంట్లోకి గాలి సరిగా వీచేలా చూడాలి. ఇంట్లో తేమ లేకుండా చూసుకోవాలి. దీంతో ఇంట్లో వాసనలు రాకుండా ఉంటాయి. ఎసెన్షియల్ ఆయిల్స్ వాడేటప్పుడు వాటిపై ఉండే సూచనల ప్రకారమే వాడాలి. లేకపోతే సమస్యలొస్తాయని గుర్తుపెట్టుకోండి.

## నిమ్మతో



### కావాల్సిన పదార్థాలు

1 కప్పు నీరుకొద్దిగా నిమ్మరసం10 చుక్కల నిమ్మ ఎసెన్షియల్ ఆయిల్5 చుక్కల లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్

ఎలా తయారు చేయాలి.

ముందుగా ఓ బౌల్ తీసుకుని అందులో నీరు, నిమ్మరసం, ఎసెన్షియల్ ఆయిల్స్ తీసుకుని బాగా కలపండి. వీటిని స్ప్రే బాటిల్‌లో పోయండి. ఒక్కసారి బాగా షేక్ చేయండి. దీనిని మీరు ఇంట్లో మూలమూలల్లో వాసనలు వచ్చే ప్రాంతంలో స్ప్రే చేయండి. వీటిని రెగ్యులర్‌గా వాడితే వాసనలు రావు. రూమ్ ఫ్రెష్‌గా ఉంటుంది.

## బేకింగ్ సోడాతో




అరకప్పు బేకింగ్ సోడా20 చుక్కల నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్

### తయారీ విధానం

ముందుగా ఓ బౌల్ తీసుకోండి. అందులో బేకింగ్ సోడా, ఎసెన్షియల్ ఆయిల్ వేయండి. బాగా కలపండి. బేకింగ్ సోడా మొత్తం ఎసెన్షియల్ ఆయిల్‌లో కలిసిపోయేవరకూ కలపండి. దీనిని గ్లాస్ కంటెయినర్‌లో వేసి మూత పెట్టండి. మూత మొత్తం కాకుండా కొద్దిగా వదులుగా పెట్టండి.

ఇది మీకు అవసరం ఉన్న చోట పెట్టండి. దీంతో వాసనలన్నీ దూరమై న్యేరల్‌గా మంచి సువాసనలు వస్తుంటాయి.

## పూరేకులతో



కొన్ని ఎండిన పూల రేకులని తీసుకోండి. ఎండిపోయిన గులాబీ, మల్లె, లావెండర్ పూరేకుల్ని తీసుకుండి. దీనిని ఓ పల్చని క్లాత్, ఫ్యాబ్రిక్ పౌచ్, టీ బ్యాగ్స్‌లో వేయాలి. వీటిని ఇంట్లోని డ్రాయర్స్, క్లోసెట్స్ ఇలాంటి ప్లేసుల్లో పెట్టాలి. దీని వల్ల ఎలాంటి స్మెల్ రాదు. ఇల్లు సువాసన భరితంగా ఉంటుంది.

## సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా



ఇప్పుడు తయారుచేసిన ఎయిర్ ఫ్రెషనర్స్ అన్నీ కూడా కెమికల్స్ లేకుండా తయారు చేసినవే. వీటిలో ఎలాంటి ప్రమాదకర కెమికల్స్ ఉండవు. కాబట్టి, చక్కగా వాడుకోవచ్చు. వీటి వల్ల ఇంట్లో తాజాదనం ఉంటుంది. ఎలాంటి సమస్యలు కూడా రావు.

